
సాక్షి
పల్నాడు
సోమవారం । 28 । ఏప్రిల్ । 2025

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 514.40 అడుగుల వద్ద ఉంది. ఇది 139.2626 టీఎంసీలకు సమానం.

మహంకాళి అమ్మవారికి విరాళం



దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులోని మహంకాళి అమ్మ వారికి గుంటూరుకు చెందిన శ్రీ వసుధ డెవలపర్స్ రూ.1,00,116 విరాళం ఆదివారం అందజేసింది.

ఘనంగా అంకమ్మ తిరునాళ్ల



రొంపిచర్ల: బుచ్చి బాపన్నపాలెం గ్రామంలోని అంకమ్మ ఆలయ తిరునాళ్ల ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మ వారిని ప్రత్యే కంగా అలంకరించారు. మహిళా భక్తులు పొంగళ్లు చేసి మొక్కు చెల్లించుకున్నారు.

న్యూస్‌రీల్

గండాలయ స్వామి కొండకు పోటెత్తిన భక్తులు



మంగళగిరి: మంగళాద్రి కొండపై వేంచేసి ఉన్న గండాలయ స్వామికి మొక్కితే ఎంతటి గండాన్నైనా గటెక్కిస్తాడని భక్తుల నమ్మకం. అమావాస్య ఆదివారం పూజలు నిర్వహిస్తే భక్తుల కోర్కెలు ఇట్టే తీరుస్తాడని ప్రసిద్ధి. దీంతో ఆదివారం కొండకు భక్తులు పోటెత్తారు. ఉదయం ఐదు గంటల నుంచే కొండకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. గండ దీపం వెలిగించారు. మంగళగిరి తాడేపల్లి చుట్టు పక్కల ప్రాంతాల నుంచే కాక విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి భక్తుల రాకతో కొండ కిటకిటలాడింది.

బడులు తెరిచే నాటికి పాఠ్య పుస్తకాలు సిద్ధం



గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలలు తెరిచే నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తెలిపారు. అమరావతి రోడ్డులోని ప్రభుత్వ పాఠ్య పుస్తక గోదాము నుంచి ఆర్టీసీ బస్సుల్లో మండలాలకు పాఠ్య పుస్తకాలను పంపించే కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. డీఈవో మాట్లాడుతూ ముద్రణ సంస్థల నుంచి జిల్లా కేంద్రంలోని పాఠ్య పుస్తక గోదాముకు వచ్చిన పుస్తకాలను మండలాలకు పంపుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా సెమిస్టర్-1లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఇండెంట్ ప్రకారం 13.24 లక్షల పుస్తకాల్లో ఇప్పటి వరకు 7.50 లక్షల పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠ్య పుస్తక మేనేజర్ వి. వజ్రబాబు, గుంటూరు ఈస్ట్ ఎంఈవో-1 అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, సిబ్బంది పాల్గొన్నారు.

రాహు కేతు పూజలకు భారీగా భక్తులు



పెదకాకాని: శివాలయంలో అమావాస్య ఆదివారం సందర్భంగా రాహు కేతువులకు పూజలు జరిపించేందుకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలోని రాహుకేతువు పూజల్లో పాల్గొనేందుకు దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వేకువ జామునే క్యూలైన్లలో బారులు తీరారు. ఉదయం నాలుగు గంటల నుంచి సాయంత్రం రాహుకాల సమయం వరకు 1,509 టికెట్లు విక్రయించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు. రాహు కేతు పూజల ద్వారా ఆదివారం రూ. 7,54,500 ఆదాయం సమకూరిందన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా దేవస్థాన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ పూజలతోపాటు అభిషేక పూజలు, అన్నప్రాసనలు, తలనీలాలు, వాహనపూజలు, అంతరాలయ దర్శనాలు, చెవిపోగులు తదితర ఇతర సేవలు ద్వారా రూ.9,10,000 ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్ తెలిపారు.

వేసవి విజ్ఞాన తరగతులు బ్రోచర్ ఆవిష్కరణ



గుంటూరువెస్ట్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ వేసవి విజ్ఞాన తరగతులు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సోమవారం నుంచి జూన్ 6 వరకు 40 రోజుల పాటు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తారన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జరిగే ఈ తరగతులకు తమ పిల్లల్ని తల్లిదండ్రులు పంపాలన్నారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, ఉప గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీ లక్ష్మి, లైబ్రేరియన్స్ ఎన్.నాగిరెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నమ్మించి.. నిండా ముంచి..!

- అధిక వడ్డీ ఆశ చూపి ప్రజల నుంచి డబ్బు వసూలు
- నమ్మకంగా ఏళ్ల తరబడి వ్యాపారాల నిర్వహణ
- రూ. వందల కోట్లు కొల్లగొట్టి పరారీ
- వ్యాపారాల పేరిట ప్రజలను మోసగిస్తున్న వైనం
- పెరుగుతున్న యానిమేషన్ స్కాం బాధితుల సంఖ్య

శరీరంపై ఖరీదైన చొక్కా, రెండు చేతులకు వేళ్లనిండా ఉంగరాలు, మెడలో జిగేలుమనిపించే బంగారు చైన్లు, రూ.లక్షలు ఖరీదు చేసే కార్లు, రూ.కోట్ల విలువైన భవనాలు, హడావుడి చేసే వ్యాపారాలు.... ఇవి ఉంటే చాలు బ్యాంకుల కంటే ఇలాంటి వారే భద్రమని నమ్మేస్తున్నారు. బ్యాంకుల్లో వడ్డీల కంటే వీరి వద్దే అధికమని ఆశ పడుతున్నారు. అదిగో ఆ హంగు.. ఇక మన డబ్బులకు ధీమా అని రూ.కోట్లకు కోట్లు వారి చేతుల్లో పెట్టేస్తున్నారు. వీరితోపాటు తమ బంధుమిత్రులనూ ఆ బడాబాబుల వలలోకి లాగేస్తున్నారు. ఆ బడాబాబులు తమ వ్యాపారంలో పరిస్థితులు తలకిందులైనట్లు కథలు చెప్పి రూ.వందల కోట్లతో పరారవుతున్నారు.



కిరణ్ (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: అవసరానికి ఉపయోగపడతాయని రూపాయి రూపాయి కూడబెట్టి పెట్టుబడులు పెట్టిన వారు భారీ మోసాలను చూసి అమ్మో అంటూ గుండెలు బాదుకుంటున్నారు. తనువు చాలిస్తున్నారు. ఇది ఓ యానిమేషన్ స్కాంతో మొదలుకాలేదు. నిత్యం ఇలాంటివి ఏదో ఒక మూల వింటూనే ఉన్నాం. అయినా సరే అధిక లాభాలు, వడ్డీల ఆశచూపి మోసగాళ్ల ప్రజల్ని మోసం చేస్తూనే ఉన్నారు. మోసపోయే మనలో కూడా ఎంతో కొంత తప్పు ఉందన్న వాస్తవాన్ని గ్రహించి జాగ్రత్తగా ఉన్నప్పుడే ఇలాంటి మోసాలకు అడ్డుకట్టపడేది.

ఆడి కార్‌లో వచ్చి మరీ..

దేశంలో ఆర్థిక నేరాలను వివిధ రూపాల్లో చూస్తుంటాం. బ్యాంకులకు రుణాలు ఎగనామం పెట్టే వాళ్ల దగ్గర నుంచి చిన్న మొత్తాల్లో చీటీలు వసూలు చేసి జేబులకు చిల్లులు పెట్టే వారు, టెక్నాలజీ సాయంతో సైబర్ మోసాలకు పాల్పడే వారు కనిపిస్తుంటారు. అయితే నరసరావుపేటలో మాత్రం నమ్మకాన్ని పెట్టుబడిగా పెట్టి నట్టేట ముంచుతున్నారు. అధిక వడ్డీల ఆశ చూపి రూ.కోట్లకు కోట్లు సేకరించి రాత్రికి రాత్రి పరారవుతున్నారు. చిట్‌ఫండ్ స్కాం, ఐపీ పెడుతున్న వ్యాపారులు, తాజాగా యాపిక్స్ యానిమేషన్ స్కాం.. ఇలా ఏది చూసినా ప్రజలను నమ్మించి నట్టేట ముంచుతున్నారు. యాపిక్స్ సంస్థ అధినేత కిరణ్ తను చేస్తున్న యానిమేషన్ ప్రాజెక్టులను లేనిది ఉన్నట్టు పెద్దగా చూపి పెట్టుబడిదారులను మోసం చేశాడు. పెద్ద ప్రాజెక్టులు వచ్చాయని ఒక్కసారిగా తన వద్ద అంత డబ్బులు లేవని నమ్మించాడు. పెట్టుబడి పెడితే ఆరు నెలల్లో రెట్టింపు చేసి ఇస్తానని నమ్మబలికాడు. ఇలా రెండేళ్ల పెట్టుబడిదారులకు లాభాల రుచి చూపడంతో వారిలో నమ్మకం పెరిగింది. మరోవైపు తమ కళ్ల ముందే కిరణ్ జీవనవిధానం రోజురోజుకు లగ్జరీగా మారడం కూడా మోసపోవడానికి కారణమైంది. సాధారణ కారులో తిరిగే కిరణ్ ఒక్కసారిగా ఆడి కార్లు, రేంజ్ రోవర్లలో చక్కర్లు కొట్టడం, విజయవాడలోని పలు ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలు, విలువైన స్థలాలు ఉండటంతో తమ డబ్బులు ఎక్కడికీ పోవనే ధీమాతో స్థోమతకు మించి పెట్టుబడులు పెట్టడంతో అడ్డంగా బుక్ అయ్యారు.



ఒట్టు వేయించుకొని మోసపోయి...

కిరణ్ తన పెట్టుబడిదారులకు రాసిన లేఖలో విస్తుపోయే విషయాలు బయటపడుతున్నాయి. పెట్టుబడిదారులకు డబ్బులు తిరిగి ఇచ్చేందుకు భారీ స్థాయిలో కొత్త పెట్టుబడిదారుల ద్వారా నగదు సేకరించానని చెప్పుకొచ్చాడు. యానిమేషన్ ప్రాజెక్టులు లేకపోయినా లాభాలు పంచి ఇవ్వడంతో పెట్టుబడిదారులు తమ స్థోమతకు మించి డబ్బుల మూటలు తెచ్చి కిరణ్‌కు అప్పగించారట. ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు పెడుతున్న సమయంలో ఎవరైనా మా డబ్బులకు గ్యారెంటీ ఏంటి అని అడుగుతారు. కానీ యానిమేషన్ బాధితులు మాత్రం తాము పెట్టుబడి పెట్టినట్టు రెండో వ్యక్తికి తెలియకూడదని ఒట్టు వేయించుకున్నారని కిరణ్ తన లేఖలో తెలిపాడంటే పెట్టుబడిదారులు ఎంతటి మాయలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఒకరికి తెలియకుండా ఒకరు రూ.కోట్లకు కోట్లు తనకు ముట్టచెప్పడంతో యానిమేషన్ స్కాం ఏకంగా రూ.వెయ్యి కోట్ల దాకా వెళ్లింది. 2024 ఏప్రిల్ వరకు తాను చెబుతున్నవి అబద్ధాలు అని తెలిసినా వారికి లాభాలు పంచి ఇవ్వడంతో ఏ ఒక్కరూ నోరు విప్పలేదని తెలిపాడు. అంటే కిరణ్ మోసం చేస్తున్నా తమకు అధిక వడ్డీతో తిరిగి ఇస్తున్నాడన్న ఆశలో పెట్టుబడిదారులు పట్టించుకోలేదని అర్థమవుతోంది. ఎంతగా అంటే మాకు మరిన్ని లాభాలు కావాలి.. నువ్వు పెద్ద ప్రాజెక్టులు చేయి, మేం డబ్బులిస్తామని తనను ప్రోత్సహించారని కిరణ్ చెప్పుకొచ్చాడు. సమాజంలో మన మధ్యే తిరుగుతున్న కిరణ్ లాంటి ఎందరో మోసగాళ్ల బారినపడుకుండా ఉండాలంటే ప్రజలు అధిక లాభాలు, వడ్డీలకు మోసపోకుండా అప్రమత్తంగా ఉన్నప్పుడే మన కష్టార్జితానికి ఎలాంటి ఇబ్బందీ ఉండదు.



నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి ఎ.భార్గవ్ తేజ

మేయర్ ఎన్నిక ఏర్పాట్ల పరిశీలన

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికకు సోమవారం జరగనున్న ప్రత్యేక సమావేశానికి సంబంధించి సమగ్ర ఏర్పాట్లు చేయాలని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ అధికారులను ఆదేశించారు. మేయర్ ఎన్నిక జరిగే నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఏర్పాట్లను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, కౌన్సిల్ సెక్రెటరీ బి.శ్రీనివాసరావు, డీఎస్పీ అజీజ్, లాలాపేట సీఐ శివ ప్రసాద్‌లతో కలిసి పరిశీలించారు. పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నిక ప్రత్యేక సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఉదయం 10:30 గంటలకు తమ గుర్తింపు కార్డులతో హాజరు కావాలని తెలిపారు. సభ్యులు మినహా ఇతరులను అనుమతించబోమని తెలిపారు. మొబైల్ ఫోన్‌లకు కూడా అనుమతి లేదన్నారు. సంస్థ ప్రధాన కార్యాలయం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ర్యాలీలు, గుంపుగా రావడానికి వీలు లేదని చెప్పారు. తగిన చర్యలను జీఎంసీ, పోలీసు అధికారులు సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

ప్రధాని సభకు చకచకా ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలించేందుకు వస్తున్న అధికారులు

తాడికొండ: మే 2వ తేదీన అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన నిమిత్తం ప్రధాని నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చకచకా కొనసాగుతున్నాయి. ఆదివారం గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పలువురు ఐపీఎస్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పర్యటన నిమిత్తం 11 పార్కింగ్ ప్రాంతాలు, 8 రోడ్లు గుర్తించి ఆయా రహదారులలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సభా వేదిక నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. సోమవారం నుంచి ఎస్‌టీజీ కమాండోల భద్రతలోకి ఈ ప్రాంతం వెళ్లనున్నట్లు సమాచారం. హెలీప్యాడ్, సభావేదిక, వీవీఐపీల పార్కింగ్ రూట్ మ్యాప్‌లను పలువురు ఐపీఎస్, ఐపీఎస్ అధికారులకు కేటాయించడంతో సంబంధిత అధికారులు దగ్గరుండి మరీ పనులు కొనసాగిస్తున్నారు. ప్రధాని సభకు దాదాపు 120 ఎకరాలు కేటాయించారు. ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 80 శాతం పనులు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఆక్రమణల తొలగింపులో 'పచ్చ'పాతం



షాపుల ముందున్న నిర్మాణాలు తొలగించగా బస్‌షెల్టర్ వదిలేసిన దృశ్యం



మెడికల్ షాపు ముందు మెట్లు తొలగించటంతో నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్న ఇనుప మెట్లు

- టీడీపీ రంగులు ఉంటే ముట్టుకోని అధికారులు

నరసరావుపేట: పట్టణంలో మున్సిపల్ అధికారులు నిర్వహిస్తున్న ఆక్రమణల తొలగింపులో 'పచ్చ' పాతం చూపిస్తున్నారనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. గత సోమవారం నుంచి పల్నాడు రోడ్డులో ఆక్రమణల తొలగింపును మున్సిపల్ పట్టణ ప్రణాళికా అధికారి సాంబయ్య నేతృత్వంలో సిబ్బంది జేసీబీ సహాయంతో నిర్వహిస్తున్నారు.

మరీ ఇంత దారుణమా?

పల్నాడు రోడ్డులోని బస్సులు, ఇతర వాహనాలు ఆగే ప్రాంతంలో రోడ్డుకు దక్షిణం వైపు మెడికల్ షాపు, టీ షాపుల ముందున్న మెట్లు డ్రైనేజీపై నిర్మించారనే కారణంతో తొలగించారు. దీంతో వినియోగదారులు కనీసం షాపుల్లోకి వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. దాని ముందు నిర్మించిన బస్‌షెల్టర్ రోడ్డుపైకి ఆరడుగులు ముందుకు చొచ్చుకొచ్చినా జోలికి వెళ్లలేదు. దానికి పసుపురంగు పులిమి ఉండటమే కారణంగా భావిస్తున్నారు. దానికి సమీపంలో టీడీపీ రంగులతో కోడిపలావ్ పేరుతో రోడ్డుపైకి నిర్మించిన కట్టడాన్ని అధికారులు ముట్టుకోలేదు. దానికి ఇరువైపులా షాపుల ముందున్న చిన్నపాటి నిర్మాణాలను తొలగించారు. ఈ ప్రాంతం చూసిన ఎవరికైనా పక్షపాతం ఎలా ఉందో అర్థమవుతుంది.

అందరివీ తొలగిస్తాం

పల్నాడు రోడ్డులో చేపట్టిన ఆక్రమణల తొలగింపులో ఎవరి ఒత్తిళ్లు పట్టించుకోవట్లేదు. ఒక బిర్యానీ హోటల్ తొలగింపులో అధికార, ప్రతిపక్షాల నుంచి ఆ పని వద్దని అభ్యర్థనలు వచ్చినా ఖాతరు చేయలేదు. రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా వ్యవహరిస్తున్నాం. ఆక్రమణలు అన్నింటినీ తొలగిస్తాం.

- కె.సాంబయ్య, పట్టణ ప్రణాళికా అధికారి

'కపిరాజు' నాటికకు ప్రథమ బహుమతి



మార్టూరు : శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 24, 25, 26 తేదీల్లో మార్టూరులో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు శనివారంతో ముగిశాయి. ఇరవై కేటగిరీలకు గాను ఆరింటిలో బహుమతులను కైవసం చేసుకుని న్యూ స్టార్ మోడ్రన్ థియేటర్ విజయవాడ వారి 'కపిరాజు' నాటిక అగ్రస్థానంలో నిలిచింది. నాలుగు కేటగిరిల్లో బహుమతులు పొంది కళానికేతన్ వీరన్నపాలెం వారి 'రుతువులేని కాలం' నాటిక ద్వితీయ స్థానం, మూడు కేటగిరిల్లో బహుమతులు సాధించి విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి 'స్వేచ్ఛ' నాటిక తృతీయ స్థానంలో నిలిచింది. కపిరాజు నాటికకు సంబంధించి ఉత్తమ ప్రదర్శన, దర్శకుడిగా ఎమ్మెస్ చౌదరి బహుమతులు అందుకున్నారు. ఉత్తమ సహాయ నటుడిగా పవన్ కల్యాణ్, మేకప్ మెన్‌గా దినేష్, పవన్ కుమార్, దిలీప్ ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. కళానికేతన్ వీరన్నపాలెం వారి 'రుతువులేని కాలం' తృతీయ ఉత్తమ ప్రదర్శనతోపాటు ఉత్తమ రచయితగా అగస్త్య, హాస్యనటునిగా సురేంద్రబాబు, సురభి పూజిత ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. 'స్వేచ్ఛ' నాటికకు గాను ఉత్తమ నటుడిగా గోవాడ వెంకట్, మంజు భార్గవి ప్రత్యేక బహుమతులు పొందారు.

ముప్పతిప్పల 'స్లాట్'

రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రభుత్వం తెచ్చిన కొత్త స్లాట్ విధానంతో ప్రజలకు ముప్పు తిప్పలు తప్పడం లేదు. అటు అధికారులు కూడా తలలు పట్టుకుంటున్నారు. రోజుకు పరిమితంగా రిజిస్ట్రేషన్లు జరగడం, నిర్దేశిత సమయానికి ఇరుపార్టీల వారు కచ్చితంగా రావాల్సి ఉండటం, ఏ చిన్న తప్పు సరిచేసుకోవాలన్నా మళ్లీ చలానా కట్టాల్సి రావడం వంటి ఇబ్బందులు ఉంటున్నాయి.

- రిజిస్ట్రేషన్ నూతన విధానంతో కష్టాలు
- నిర్ణీత సమయానికి వెళ్లకుంటే స్లాటు రద్దే
- చిన్న తప్పున్నా చలానా పరిస్థితీ అంతే



గురజాలలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

గురజాల : గురజాలలో స్లాట్ విధానం అమలైన తొలిరోజు శనివారం ఒక దస్తావేజును బుకింగ్ చేశారు. ఆ సమయంలో సర్వే నెంబరు తప్పుగా నమోదైంది. సీఎస్ నెంబరు తీసుకుని ఇరు పార్టీల వారు వచ్చారు. ఆ సమయంలో సర్వే నెంబరు చూసుకోవడంతో కట్టిన చలానా రద్దు అయింది. మళ్లీ చలానా మరొకటి చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి వచ్చింది. అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నూతన విధానాన్ని శనివారం నుంచి అమలులోకి తీసుకువచ్చారు. ఈ విధానంపై ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీని వలన సమయం ఆదా అవుతుందని సకాలంలో రిజిస్ట్రేషన్ పూర్తి అవుతాయని ప్రభుత్వం చెబుతోంది. క్షేత్ర స్థాయిలో పరిస్థితులకు పొంతన లేకుండా పోయిందనే విమర్శలు వస్తున్నాయి. సమయం ఆదా సంగతి పక్కన పెడితే ఇరు పార్టీల వారు ఒకేసారి అందుబాటులోకి రావాలి. ఏ ఒక్కరూ పది నిమిషాలు ఆలస్యం అయినా రిజిస్ట్రేషన్ జరిగే అవకాశాలు లేవు. దస్తావేజులో ఏమైనా తప్పు దొర్లినా సవరించుకునే అవకాశం కూడా లేదు. మళ్లీ చలానా చెల్లించాల్సిన పరిస్థితి. దీనిపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఆర్థికంగా తమపై భారం పడటం తప్ప ఒరిగిందేమీ లేదని వాపోతున్నారు.

ఎక్కువ రిజిస్ట్రేషన్లు అసాధ్యం

పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, గురజాల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, క్రోసూరు, పెదకూరపాడు, అమరావతిలలో మొత్తం పది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలోని గ్రామాల్లో ఆయా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. పాత విధానంలో ఏ సమయంలో అయినా పనులు చేసుకునేందుకు వెసులుబాటు ఉండేది. కొత్త పద్ధతి ప్రజలతోపాటు కార్యాలయ వర్గాలకు సైతం తలనొప్పిగా మారింది. కాస్త ఆలస్యమైతే స్లాటు బుకింగ్ రద్దు అవుతోంది. రోజుకు స్థానిక కార్యాలయంలో 39 రిజిస్ట్రేషన్‌లు, జిల్లా కేంద్రంలో 78 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగేలా స్లాట్ విధానం ఉంది. దీని వలన ప్రభుత్వ ఆదాయానికి సైతం గండి పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

బాలుర వాలీబాల్ పోటీల విజేత సత్తెనపల్లి



సత్తెనపల్లి జట్టుకు బహుమతి అందిస్తున్న దృశ్యం



రన్నర్‌గా నిలిచిన విజయవాడ-1 జట్టు

సత్తెనపల్లి: అండర్-17 బాలుర వాలీబాల్ పోటీల విజేతగా పీఎం శ్రీ కేవీ సత్తెనపల్లి సత్తా చాటింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి (రామకృష్ణాపురం)లోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న 54వ కేవీస్ హైదరాబాద్ రీజినల్ స్థాయి అండర్-17 బాలుర వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగి ఆదివారం ముగిశాయి. విజయవాడ-1 జట్టుపై సత్తెనపల్లి జట్టు గెలిచి టోర్నీ విజేతగా నిలిచింది. వాల్తేరుపై గెలిచి ఖమ్మం జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకుంది. అనంతరం బాల, బాలికల జాతీయ జట్లను ఎంపిక చేశారు. బహుమతి ప్రదానోత్సవంలో ఏపీ ఫైర్ స్టేషన్ అండ్ సివిల్ ట్రైనింగ్ సెంటర్ డీఎఫ్ఓ సత్యనారాయణ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విభిన్న రంగాల్లో రాణిస్తేనే ఫలితం ఉంటుందని తెలిపారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఇన్‌చార్జి ప్రిన్సిపల్ బి.కిరణ్‌రెడ్డి, రిటైర్డ్ పీడీ ఐఏఎస్ నాగిరెడ్డి, రిఫరీలు, తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడుకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి

యడ్లపాడు: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ఆదివారం యడ్లపాడును సందర్శించారు. స్థానిక విశ్రాంత దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పోపూరి గంగయ్య చౌదరి నివాసానికి వెళ్లి గంగయ్య చౌదరి, భారతి దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రమణకృష్ణ, స్థానిక నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ చెరుకూరి సృజన, డైరెక్టర్ పోపూరి వెంకటేశ్వర్లు (చిన్నా), పోపూరి రాఘవయ్య, పోపూరి వెంకటరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

డీఎస్సీపై అభ్యర్థుల అభ్యంతరాలను పరిష్కరించాలి

డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న



లక్ష్మీపురం: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో అభ్యర్థుల అభ్యంతరాలను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ డీఎస్సీ ప్రకటించాలని చేసిన ఆందోళన ఫలితంగా నోటిఫికేషన్ విడుదల చేయడం అభినందనీయం అన్నారు. ఏడేళ్లుగా నోటిఫికేషన్ విడుదల చేయని కారణంగా వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని, పరీక్షకు సిద్ధమయ్యేందుకు కనీసం 90 రోజులు సమయం కావాలని, ఒకే జిల్లాకు ఒకే పేపర్ ఉండాలనే అభ్యర్థుల అభ్యంతరాలపై విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని కోరారు. ఎప్పుడు లేని మార్కుల పర్సంటేజ్‌ని తీసుకువచ్చారని అన్నారు. ఇప్పటి వరకు అభ్యర్థుల అభ్యంతరాలపై మాట్లాడకపోవడం చూస్తే మంత్రికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందని చెప్పారు. ఇప్పటికైనా మంత్రి లోకేష్ స్పందించి వారి అభ్యంతరాలను పరిష్కరించాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ మాట్లాడుతూ అభ్యర్థుల అభ్యంతరాలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే వారితో కలిసి ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా నాయకులు పి.భార్గవ్, పి.బాషా, ఎం.ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నదిలో దూకి గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాడేపల్లి రూరల్: కృష్ణానది ప్రకాశం బ్యారేజ్ పైనుంచి ఓ వ్యక్తి కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై తాడేపల్లి పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణానది సీతానగరం వైపు ప్రకాశం బ్యారేజ్ 6వ ఖానా వద్ద శనివారం రాత్రి ఓ యువకుడు కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణానది నీటి స్టోరేజ్ కోసం ఏర్పాటు చేసిన గేటుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకుని పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 30 సంవత్సరాలు లోపు ఉంటుంది. మృతుడి శరీరంపై నల్ల జీన్స్ ఫ్యాంట్, నల్లని చొక్కా ధరించి ఉన్నాడు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే 8008443915 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్ఐ కోరారు.

కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని తుడిచి పెట్టాలి

మార్కెట్ సెంటర్‌లో పలు సంఘాల నాయకులు నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పలు సంఘాల నాయకులు

నరసరావుపేట: కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద చర్యలను నిరసిస్తూ శనివారం లాల్‌బహదూర్ కూరగాయల మార్కెట్ వద్ద మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో పలు సంఘాల నాయకులు నిరసన తెలిపారు. మృతులకు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. దేశంలో ఉగ్రవాదం నశించాలని, దేశ సమైక్యతను కాపాడాలని, పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ ఉగ్రవాదానికి మతం లేదని, అది ఏ రూపంలో ఉన్నా కూకటివేళ్లతో దేశం నుంచి పెకిలించి వేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు, పాకిస్తాన్ ఉగ్రవాదులను తయారు చేసి దేశంలో అలజడి సృష్టించాలని చూస్తోందని తెలిపారు. మన దేశంలో పాకిస్థాన్ ఆటలు సాగబోవని హెచ్చరించారు. ఉగ్రవాదుల చేతులలో అమరులైన కుటుంబలను కేంద్రం ఆదుకోవాలని కోరారు. కాశ్మీర్ ప్రజల ధైర్యసాహసాలను ఆయన కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ తీసుకునే ఎటువంటి చర్యలకైనా తమ వంతు మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి షేక్ మాబుసుభాని, జిల్లా అధ్యక్షులు రఫీ, జిల్లా కార్యదర్శి ఖాసీం పీరా, ఇమాంసా, ఖాజా మున్నా, సుభాని సయ్యద్ బాషా, అర్షద్ పాల్గొన్నారు.

ఉప సభాపతి రఘురామ వ్యాఖ్యలు అనుచితం

సీపీఎం సర్వసభ్య సమావేశంలో జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్



మాట్లాడుతున్న విజయకుమార్

నరసరావుపేట: కార్మిక, కర్షక, పీడిత వర్గ ప్రజల కోసం పోరాటం చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలపై ప్రభుత్వాలకు ఉన్నతమైన సూచనలు చేస్తూ నిస్వార్థంగా ప్రజా పోరాటాలు చేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం పార్టీ నరసరావుపేట మండల సర్వసభ్య సమావేశం పట్టణ కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ అధ్యక్షతన నిర్వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉపసభాపతి స్థానానికి రఘురామకృష్ణంరాజు అనర్హుడన్నారు. బ్యాంకులు నుంచి రూ.600కోట్లకు పైగా రుణాలు పొంది ఎగ్గొట్టిన ఆర్థిక ఉగ్రవాది అంటూ ఎద్దేవాచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని, పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ తీసుకొచ్చిన నాలుగు లేబరు కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జమ్ము కశ్మీర్‌లో ఉగ్ర దాడి కేంద్ర ప్రభుత్వం వైఫల్యమే కారణమని ఆరోపించారు. అక్కడ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎ.వి.కె దుర్గారావు, డి.శివకుమారి, కె.పి.జి. మెటిల్డాదేవి, షేక్ సిలార్ మసూద్, టి. పెద్దిరాజు, కట్టా కోటేశ్వరరావు, బి. సలీం, సుభాష్ చంద్రబోస్, కె. రామారావు, షేక్ మస్తాన్ వలి, కె.నాగేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

పల్నాడు యువతులకు గిన్నిస్ రికార్డులో చోటు



గిన్నిస్ అవార్డును అందుకుంటున్న ఇనుముక్కల కవిత, కోటేశ్వరి

పిడుగురాళ్ల రూరల్: పిడుగురాళ్ల మండలంలోని జూలకల్లు గ్రామానికి చెందిన యువతులు గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించారు. విజయవాడలోని హలెల్ మ్యూజిక్ స్కూల్ మాస్టర్ బి. అగస్టీన్ సారథ్యంలో 2024 డిసెంబర్ 1న 18 దేశాల నుంచి ఒకేసారి 1,090 మంది కళాకారులు కీబోర్డును ప్లే చేసి ఇన్‌స్టాగామ్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ వీడియో ప్రపంచ రికార్డును సాధించడంతో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులోకి ఎక్కింది. అందులో పాల్గొన్న 1,046 మందికి ఏప్రిల్ 25న విజయవాడ గుణదల మెట్రోపాలిటిన్ మిషన్ చర్చిలో ధ్రువపత్రాలు అవార్డులను పంపిణీ చేశారు. అందులో జూలకల్లు గ్రామానికి చెందిన ఇనుముక్కల కవిత, ఇనుముక్కల కోటేశ్వరికి ఈ రికార్డులో చోటు దక్కడంతో సర్టిఫికెట్, అవార్డును అందుకున్నారు. వీరిద్దరు పాస్టర్ బంకా సురేష్ సహకారంతో ఈ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో పాల్గొన్నట్లు తెలిపారు. కవిత, కోటేశ్వరిలను గ్రామ ప్రజలు, చర్చి సంఘ పెద్దలు అభినందించి, సన్మానించారు.

మద్యం మత్తులో పరస్పర దాడులు

చీరాల: మద్యం మత్తులో ఇరువురు వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటన ఆదివారం చీరాలలో చోటుచేసుకుంది. శ్రీకాంత్, ప్రశాంత్ ఇద్దరు బంధువులు. ఆదివారం మద్యం తాగి ఇద్దరు ఘర్షణ పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో శ్రీకాంత్‌కు గొంతులో కత్తి గుచ్చుకుంది. చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించారు. ప్రశాంత్ చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు అవుట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేశారు.

అక్రమ జంతు రవాణాపై విస్తృత తనిఖీలు




పిడుగురాళ్ల: వన్య ప్రాణుల అక్రమ రవాణా అరికట్టేందుకు అటవీ శాఖ అధికారులు ఆదివారం తెల్లవారుజామున స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పల్నాడు జిల్లా అటవీ శాఖ అధికారి జి. కృష్ణప్రియ ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు రేంజ్‌లు పిడుగురాళ్ల, వినుకొండ, మాచర్ల, నర్సరావుపేటలో తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. వన్య ప్రాణులు, వృక్ష సంపద పరిరక్షణపై వాహనదారులకు, ప్రజలకు, అటవీ ప్రాంతంలో నివసిస్తున్న వారికి అవగాహన కల్పించారు. జిల్లావ్యాప్తంగా వినుకొండ, బొల్లాపల్లి, కారంపూడి, దుర్గి, మాచర్ల, పాపాయపాలెం, దాచేపల్లి, పిడుగురాళ్ల, బెల్లంకొండ, పాపాయపాలెం, నకరికల్లు, అచ్చమ్మపేట ప్రాంతాల్లో నాకాబంది నిర్వహించారు. కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్లు కె. విజయకుమారి, పి. మాధవరావు, డి. వెంకట రమణ, విజయలక్ష్మితో జిల్లాలోని ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి



పిడుగురాళ్ల: మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని సున్నపు బట్టీల సెంటర్‌లో ఆదివారం ప్రజా సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గత వారం రోజు నుంచి 12 వేల మందికి పైగా సాయిధ పోలీసులు, సైనిక బలగాలు కర్రెగుట్టను చుట్టుముట్టి జరుపుతున్న కాల్పులను వెంటనే నిలిపివేయాలని కోరారు. హెలికాప్టర్, డ్రోన్లను మోహరించి ఆదివాసీలు, మావోయిస్టులను హతమార్చే లక్ష్యంతో జరుగుతున్న ఈ దాడిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర నాయకులు కె. శ్రీనివాసరావు, వై. వెంకటేశ్వరరావు, భారత్ బచావో జిల్లా కార్యదర్శి షేక్ సర్దార్, ఎంసీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్రహాం లింకన్, జిల్లా కార్యదర్శి ఒర్సు కృష్ణ పాల్గొన్నారు.

ఇగ్నో కోర్సులతో ఉద్యోగావకాశాలు పుష్కలం



గుంటూరు ఎడ్యుకేషన్: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) అందిస్తున్న కోర్సులతో పుష్కలమైన ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని ఇగ్నో ప్రాంతీయ కేంద్ర డైరెక్టర్ డాక్టర్ పి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ప్రాంగణంలోని ఇగ్నో అధ్యయన కేంద్రంలో ఆదివారం 2025 జనవరిలో భాగంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. శరత్‌చంద్ర మాట్లాడుతూ ఇగ్నో అందిస్తున్న వివిధ రకాల కోర్సుల గురించి వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే ఉద్దేశంతో ఇగ్నో అందిస్తున్న మెటీరియల్ అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఇగ్నో సైట్‌లో పొందుపరచి ఉంటుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని చక్కగా చదువుకోవాలని చెప్పారు. ఇగ్నో అధ్యయన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ డీవీ చంద్రశేఖర్ మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా చదువుకోవాలనే లక్ష్యం కలిగిన వారు ఇగ్నో ద్వారా వారి ఆశయాన్ని నెరవేర్చుకోవాలని సూచించారు. ఇగ్నో వంటి ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయంలో చదవడం ద్వారా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్స్ గురించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అధ్యయన కేంద్ర కౌన్సిలర్ డాక్టర్ ఎంఎస్ నారాయణ, సహాయ సమన్వయకర్తలు డాక్టర్ పి.దేవేంద్ర గుప్త, ఎం.మార్కండేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గుంటూరులో కోకో రైతుల ధర్నా

కొరిటిపాడు(గుంటూరు): అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర కల్పించాలని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం ధరల ఒప్పందం నిర్ణయం ప్రకటించాలని కోరుతూ సోమవారం రైతులు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బొల్లు రామకృష్ణ, కె.శ్రీనివాస్‌లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు గుంటూరు చుట్టుగుంటలోని ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే కోకో రైతుల ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 75 వేల ఎకరాల్లో కొబ్బరి, ఆయిల్ పామ్ అంతర పంటగా కోకోను రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు అంతర్జాతీయ మార్కెట్ ధరకు అదనంగా ధర ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేసిన కంపెనీలు నేడు సిండికేట్‌గా మారి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో గింజలకు రూ.750 పైగా ధర ఉందని, ప్రస్తుతం కంపెనీలు రూ.450 నుంచి రూ.500 వరకు మాత్రమే ఇస్తున్నాయని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతుల నుంచి కోకో గింజలను కొనుగోలు చేయడం లేదని, ఒకవేళ చేసినా తక్కువ ధర ఇవ్వడం వల్ల నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోకో గింజలు కొనుగోలు, ధరల సమస్యలపై ఈ నెల 3వ తేదీన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెంనాయుడు రాష్ట్ర సచివాలయంలో ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు, కోకో రైతులు, కొనుగోలు కంపెనీలతో సమావేశం నిర్వహించారని వెల్లడించారు. ఈ సమావేశం నిర్ణయం ప్రకారం ఈ నెల 7వ తేదీన కోకో గింజల ఒప్పంద నిర్ణయం ప్రకటన చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు ప్రకటించకపోవడంతో కంపెనీలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు ఫలితంగా కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలకు ధర కల్పించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో కోకో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

కుమారుడు సహా తల్లి ఆత్మహత్యాయత్నం

- ప్రాణాలు కోల్పోయిన బాలుడు
- విషమంగా తల్లి పరిస్థితి

లక్ష్మీపురం: కుటుంబ కలహాలతో కుమారుడు సహా ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనలో బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. తల్లి పరిస్థితి విషమంగా ఉంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామానికి చెందిన ఆదూరి గణేష్ (38), కుమారి దంపతులకు కుమారుడు చంద్రశేఖర్ మణికంఠ (9) ఉన్నాడు. గణేష్ గుంటూరు ఎల్‌వీఆర్ క్లబ్‌లో పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మార్చి 30వ తేదీన గుండె పోటు కారణంగా మృతి చెందాడు. ఆ తరువాత గుంటూరులోని మారుతీనగర్‌లో గల మహాప్రస్థానంలో నిద్ర చేయడానికి కుమారి, చంద్రశేఖర్ మణికంఠలతోపాటు అత్తమామలు వెళ్లారు. భర్త మృతితో కుమారి మానసికంగా బాధపడుతోంది. ఈ నెల 24వ తేదీన కుమారుడిని అత్త మందలించడంతో ఎలుకల మందు తీసుకుని గుజ్జనగుండ్ల పార్క్‌కు కుమారి వెళ్లింది. బాలుడికి తినిపించి తానూ తిని ఆత్మహత్యాయత్నం చేసింది. తర్వాత అమరావతికి చేరుకున్నారు. అత్తమామలు పట్టాభిపురం పోలీసులను ఆశ్రయించడంతో సీఐ గంగా వెంకటేశ్వర్లు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అమరావతిలో ఉన్నట్లు గుర్తించారు. స్థానికులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ చంద్రశేఖర్ మణికంఠ ఆదివారం మృతి చెందాడు. కుమారి పరిస్థితి విషమంగా ఉంది.

గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడితే శంకర్‌నాయక్



మాట్లాడుతున్న శంకర్ నాయక్

మాచర్ల: ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్ కల్పించాలని గిరిజన ప్రజా సమైక్య వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడితే శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 1962లో ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్‌ను రద్దు చేయించి, మాచర్ల, కదిరి లాంటి నియోజక వర్గాలను జనరల్‌కు మార్చారని, దీని వల్ల మైదాన ప్రాంతంలో ఒక్క ఎస్టీ ఎమ్మెల్యే లేకుండా అన్ని వర్గాలు కుట్ర చేశాయనితెలిపారు. ఆదివారం గిరిజన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన రాష్ట్ర నాయకులు మండ్లి పెద్ద మల్లుస్వామి, నూన్సావత్ రంగా నాయక్, సైదా నాయక్, సర్పంచ్ శ్రీను నాయక్‌లతో కలిసి మాట్లాడారు. 2026లో దేశ వ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని చెప్పారు. ఇందులో గిరిజన జనాభాను జిల్లాల వారీగా యూనిట్‌గా తీసుకొని తమ హక్కులకు భంగం కలిగించకుండా నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలనే పోరాటంలో భాగంగా మాచర్లలో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. రాబోయే రోజుల్లో జిల్లాల వారీగా గిరిజనుల సమావేశాన్ని నిర్వహించి, విజయవాడలో లక్షలాది మంది గిరిజనుల హక్కులపై పోరాటం చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే గిరిజనులు రాష్ట్రవ్యాప్తంగా 12శాతం ఉండగా, ఆరు శాతం రిజర్వేషన్ మాత్రమే ఇచ్చారని తెలిపారు. దీనిపై కుట్ర చేసి అభివృద్ధి చెందిన వడ్డెర, బోయ కులాలను ఎస్టీల్లో చేర్చే కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. గిరిజన, యానాది, ఎస్టీలకు అన్యాయం చేసే కుట్ర జరుగుతుందని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల గిరిజనుల కోసం పోరాటం చేస్తామని వివరించారు. పల్నాడు జిల్లా మాచర్లలోని సమావేశం పునాది అని, పోరాటానికి నాంది అని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సంఘం విస్తరించేందుకు జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

జత పళ్ల విభాగంలో విజేత బయ్యారం ఎడ్లు



పోటీలో బండ లాగుతున్న ఎడ్ల జత

దాచేపల్లి: స్థానిక వీర్ల అంకమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ఆదివారం జరిగాయి. జత పళ్ల విభాగంలో 10 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. పల్నాడు జిల్లా బయ్యారానికి చెందిన కడియం మణికంఠ ఎడ్ల జత 3,553 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా బసినేపల్లికి చెందిన యండ్లకంట్ల వెంకట చైతన్యకుమార్ ఎడ్ల జత 3,500 అడుగుల దూరం బండలాగి రెండవ స్థానం, వైఎస్సార్ కడప జిల్లా పాలూరుకి చెందిన కొణుదల హేమలతరెడ్డి ఎడ్లజత 3,324 అడుగుల దూరం బండ లాగి మూడో స్థానంలో నిలిచాయి. మాచయపాలేనికి చెందిన గౌరు కార్తికేయ, అబ్బూరుకి చెందిన నక్క బలరామకృష్ణయ్య సంయుక్త ఎడ్లజత 3,278 అడుగుల దూరం లాగి నాలుగో స్థానం, దాచేపల్లికి చెందిన కల్లూరి కార్తిక్ నాయుడు, భార్గవ్ నాయుడు ఎడ్లజత 3.235 అడుగుల దూరం లాగి ఐదవ స్థానం, మేళ్ల చెరువుకి చెందిన కొప్పుల గోవర్ధన్‌రెడ్డి, ప్రవలీష్‌రెడ్డి ఎడ్లజత 3,195 అడుగుల దూరం లాగి ఆరవ స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదు, షీల్డ్‌ను దాతలు బహూకరించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా గూడా శ్రీనివాసరావు వ్యవహరించారు. కమిటీ సభ్యులు కొప్పుల గిరి, మునగా నిమ్మయ్య, అనిశెట్టి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలి మృతి



లక్ష్మి (ఫైల్)

వెల్దుర్తి: ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకొని ఓ వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తపుల్లారెడ్డి గూడెం సమీపంలో ఆదివారం జరిగింది. మాచర్ల పట్టణానికి చెందిన తెడ్లా లక్ష్మి (65) శనివారం సాయంత్రం 5గంటల సమయంలో భర్త శంకరరావు గుడికి వెళ్లిన సమయంలో ఒంటిపై ఉన్న బంగారపు నానుతాడు, ఉంగరం ఇంట్లో టేబుల్‌పై పెట్టి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. భర్త ఇంటికి వచ్చి చూడగా తాళం వేసి ఉంది. బాత్‌రూంలో తాళం చెవి ఉండటంతో తలుపు తెరిచి లోపలకు వెళ్లాడు. టేబుల్‌పై బంగారపు వస్తువులు ఉండటంతో శంకరరావు ఇరుగు పొరుగు వారిని వాకబు చేశాడు. లక్ష్మి కనిపించకపోవడంతో మాచర్ల టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఉదయం కొత్తపుల్లారెడ్డిగూడెం శివారులో బహిర్భూమికి వెళ్లిన వారు ఆంజనేయస్వామి దేవాలయం పక్కన కాలిపోయిన స్థితిలో మృతదేహం ఉందని గ్రామస్థులకు తెలపగా వారు వెల్దుర్తి పోలీసులకు సమాచారమందించారు. వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు వెల్దుర్తి ఎస్ఐ సమందర్ వలి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ఐదో రోజుకి చేరిన మహా మంజీర నాదం నృత్యాలు



బాద్‌షా షేక్ మణిపురి నృత్య ప్రదర్శన



ఒడిశా నృత్యంతో గోకుల్ శ్రీదాస్



భరత నాట్యం ప్రదర్శిస్తున్న డాక్టర్ శరత్‌చంద్ర

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై 15వ అంతర్జాతీయ నృత్య దినోత్సవంలో భాగంగా మహామంజీర నాదం-2025 ఆదివారం ఐదో రోజుకి చేరాయి. శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో జరగ్గా, నూతలపాటి తిరుపతయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అనంతరం బాద్‌షా షేక్(పశ్చిమ బెంగాల్) మణిపురి నృత్యాన్ని, గోకుల్ శ్రీదాస్ (భువనేశ్వర్) ఒడిశా నృత్యాన్ని, డాక్టర్ శరత్‌చంద్ర (తిరుపతి) భరతనాట్యం ప్రదర్శించారు. సభికులను నృత్యాలు అలరించాయి. ఆరవేటి ప్రభావతి, డాక్టర్ కె.దేవేంద్ర పిళ్లైలకు ప్రముఖ భరత నాట్య గురువు మరంగంటి కాంచనమాల జీవిత పురస్కారం అందించారు. కళాకారులను సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం కళాకారులను యువ కళారత్న పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో తిరుపతి ఎస్వీ మ్యూజిక్ అండ్ డాన్స్ కళాశాల పూర్వ ప్రధానాచార్యురాలు ఎస్.జానకీరాణి పాల్గొనగా, పఠాన్ మోహిముద్దీన్, వెంకటగిరి నాగలక్ష్మి పర్యవేక్షించారు.

మే 2 నుంచి కొలకలూరులో ఆహ్వాన నాటికల పోటీలు

తెనాలి: రూరల్ మండల గ్రామం కొలకలూరుకు చెందిన కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉభయ రాష్ట్రస్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీలు మే నెల 2-4 తేదీల్లో జరగనున్నాయి. గ్రామంలోని చిన్న రథశాల వద్ద ప్రతిరోజూ రాత్రి ఏడు గంటల్నుంచి 11 గంటల వరకు పోటీలు జరుగుతాయని శ్రీసాయి ఆర్ట్స్ దర్శకుడు, రంగస్థల, సినీనటుడు గోపరాజు విజయ్ ఆదివారం తెలియజేశారు. తొలిరోజున కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు వైఎస్‌కేఎస్ స్వామి, ఉపాధ్యక్షుడు సుద్దపల్లి మురళీధర్ జ్యోతిప్రజ్వలన చేస్తారు. తొలి ప్రదర్శనగా ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి 'కిడ్నాప్' నాటికను ప్రదర్శిస్తారు. రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు. తర్వాత కళానికేతన్-వీరన్నపాలెం వారి 'రుతువు లేని కాలం' నాటిక వుంటుంది. అగస్త్య రచించిన నాటికకు వైబీ చౌదరి దర్శకత్వం వహిస్తారు. చివరగా గురజాడ కళామందిర్-విజయవాడ వారి 'మహాప్రస్థానం' నాటికను ప్రదర్శిస్తారు. 3వ తేదీన విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్-హైదరాబాద్ వారి 'స్వేచ్ఛ', యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ వారి '27వ మైలురాయి', మైత్రి కళానిలయం-విజయవాడ వారి 'బ్రహ్మ స్వరూపం'నాటికలను ప్రదర్శిస్తారు. చివరిరోజైన 3వ తేదీన లలిత శ్రీకళాసమితి, శ్రీకాకుళం వారి 'మతమా? మానవత్వమా' నాటిక, మహతి క్రియేషన్స్, హైదరాబాద్ వారి 'ఉక్కు సంకెళ్లు' నాటికలను ప్రదర్శిస్తారు. చివరగా శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు వారి ప్రత్యేక ప్రదర్శన 'జనరల్ బోగీలు' నాటికను ప్రదర్శిస్తారు.

కళాప్రముఖులకు అవార్డుల ప్రదానం

ఆహ్వాన నాటికల పోటీల వేదికపై ప్రముఖులకు అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని విజయ్ తెలియజేశారు. తొలిరోజున ఆకుల సాంబశివరావు అధ్యక్షతన జరిగే సభలో నటుడు, దర్శకుడు కరణం సురేష్ జ్ఞాపకార్థం 'సవ్యసాచి' అవార్డును తాడేపల్లికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు గంగోత్రి సాయికి బహూకరిస్తారు. సంగీత దర్శకుడు తుమ్మల సాంబశివరావు స్మారకంగా బైరికి చెందిన సంగీత దర్శకుడు పి.లీలామోహనరావును సత్కరిస్తారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా పాల్గొంటారు. 3వ తేదీన జరిగే సభలో గోపరాజు హేమలత జీవిత సాఫల్య పురస్కారాన్ని ఒంగోలుకు చెందిన రంగస్థల నటీమణి ఎం.రత్నకుమారికి ప్రదానం చేస్తారు. పిన్నమనేని మృత్యుంజయరావుకు సభకు అధ్యక్షత వహిస్తారు. 4వ తేదీన గోపరాజు బాలాత్రిపురసుందరి జీవిత సాఫల్య పురస్కారాన్ని రంగస్థల, సినీనటి సురభి ప్రభావతి బహూకరిస్తారు. పసుమర్రుకు చెందిన రూపశిల్పి పచ్చల శేషగిరిని రూపశిల్పి మదన్‌మోహన్ స్మారకంగా సత్కరిస్తారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతారని వివరించారు.